విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 9, మే 2025 | 8 పేజీలు

నయా ఫాసిజాన్ని ఐక్యంగా ఎదుర్కొందాం

- 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి' సభలో ఎం.ఎ బేబి
- ఏపీ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి : విఎస్ఆర్

-2లో

గ్రూప్-1 పరీక్షకు 608 మంది హాజరు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లాలో గురువారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 608 (66.74 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగాయని, 911 అభ్యర్థులకు గాను 608 అభ్యర్థులు హాజరయ్యారని వెరసి మొత్తం 66.74 శాతం హాజరయ్యారని, 303 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు.

పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో

ఎల్‌జి కంపెనీ ఏర్పాటు ఒక మైలురాయి

- వార్త మెయిన్‌లో

- శ్రీసిటీలో ఎల్‌జి కంపెనీ యూనిట్ భూమిపూజలో రాష్ట్ర మంత్రి నారాలోకేష్
- ఎపిని ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్‌గా మార్చేందుకు ప్రజా ప్రభుత్వం బాటలు!
- మేడ్ ఇన్ ఆంధ్ర నుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు జైత్రయాత్ర కొనసాగుతుంది
- స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపనున్న ఎల్‌జి యూనిట్
- రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక తొలి ఎఫ్‌డిఐ శ్రీసిటీ ఎల్‌జి యూనిట్
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా ఎపి

ఐఓసిఎల్‌లో మాక్ డ్రిల్

భద్రతా ప్రమాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి లు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లాలో భద్రతా ప్రమాణాలు పై దృష్టి సారించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలలో భద్రతా ప్రమాణాల పై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో గురువారం యాదమరిలో గల ఐఓసిఎల్ లో భద్రతా ప్రమాణాల పై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలుతో కలసి మాక్ డ్రిల్ నిర్వహించి అనంతరం చీఫ్ టెర్మినల్ అరుణ్ ప్రసాద్ తో సమావేశమై భద్రతా చర్యలు, ఇన్సైడ్ యాక్సిస్ లిమిటేషన్ లు, బయటి వ్యక్తుల అనుమతి నియంత్రణ, సిబ్బంది నైపుణ్యాభివృద్ధి పై సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఓసిఎల్ టెర్మినల్ వద్ద పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాలన్నారు. ఊహించని ఘటనలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాల పై పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పైప్ లైన్ సెక్యూరిటీ, నిర్వహణ, ఇంధనం స్టోరేజ్ ట్యాంక్‌ల వద్ద భద్రత, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకుంటున్న చర్యల పై సమీక్షించి ముందస్తు జాగ్రతా చర్యలను తీసుకోవాలన్నారు. వాహనాల ప్రవేశ ద్వారాలను పరిశీలించాలని, కట్టుదిట్టమైన భద్రత ఉండాలన్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలపై సమీక్షించి ఆదునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐఓసిఎల్ వద్ద నైట్ డ్యూటీ లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, ఇతర ప్రాంతాల నుండి ఇంధనం నింపుకోవడానికి వచ్చే లారీలను పూర్తి స్థాయిలో తనిఖీ చేసే సమయంలో వాహనాల స్థితిని పరిశీలించి పంపాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగినట్లైతే పూర్తి అప్రమత్తంగా ఉంటూ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పి

-2లో

వైభవంగా ముగిసిన శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు

భక్తులను విశేషంగా ఆకట్టుకున్న భక్తి వాద్య సంగీతం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయ మహోత్సవాలు గురువారం సాయంత్రం తిరుమలలో ఘనంగా ముగిసాయి. సాయంత్రం శ్రీవారి ఆలయం నుండి స్వామివారు గరుడవాహనంపై, దేవేరులు వేర్వేరు పల్లకీలపై ఊరేగింపుగా బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతీ పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు.ముందు రెండురోజుల మాదిరే ఎదుర్కోలు, పూల చెండ్లాట, నూతన వస్త్ర సమర్పణ తదితర కల్యాణ వేడుకలు ఘనంగా ముగిసిన తరువాత కొలువు జరిగింది. వెంటనే ఋుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాలను పారాయణం చేశారు. కళాకారులు మంగళకరంగా సంగీత, మేళ, తాళ వాయిద్యాలను ప్రదర్శించారు. తర్వాత అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు లోకనాథరెడ్డి, లావణ్య బృందం పసిడి అక్షింతలవి..., చూడరమ్మ సతులాల, తెలిసిన వారికి దేవుడితడే..., తదితర అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.అనంతరం స్వామి దేవేరులతో కలిసి ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. దీంతో మూడురోజుల పద్మావతీ పరిణయోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు, ఈవో జె శ్యామలరావు దంపతులు, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు సాంప్రదాయ వంటకాలు అందించాలి

-2లో

- హొటళ్లలో పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండాలి
- టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

- వార్త మెయిన్‌లో

ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి

మాక్ డ్రిల్

(మొదటి పేజీ తరువాయి) మాట్లాడుతూ మాక్ డ్రిల్ సమయంలో ఐఓసిఎల్‌లో ఉన్న స్టోరేజ్ పాయింట్లలో ఉగ్రవాదుల దాడులను ఎదుర్కొనేందుకు ఎలా స్పందించాలో తెలిపారు. ఐఓసిఎల్ వంటి ఇంధన సంస్థలు ఉగ్రదాడులకు ప్రధాన లక్ష్యాలుగా మారే అవకాశాలు ఉండడంతో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. భద్రతకు సంబంధించి మానవ వనరుల వివరాలు, వాటి విధులు అప్రమత్తతా స్థాయిలను అధ్యయనం చేశారు. పారిశ్రామిక సంస్థలు తమంతట అవే భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కలిసి పని చేస్తుందని హామీ ఇచ్చారు. ఐఓసిఎల్ టెర్మినల్ చీఫ్ వివరిస్తూ చెన్నై నుండి అండర్ గ్రౌండ్ పైప్ లైన్ ద్వారా ఇంధనం సరఫరా జరుగుతుందని, 2013 నుండి టెర్మినల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని, రాత్రి సమయంలో టెర్మినల్ కార్యకలాపాలు ఉండవని జిల్లా కలెక్టర్, ఎస్పీకి వివరించారు .ఈ మాక్ డ్రిల్‌లో ఐఓసిఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, అడిషనల్ ఎస్ పి రాజశేఖర్ రాజు, తహశీల్దార్ పార్థసారథి, ఇతర సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా అవగాహన

అందరికి చికిత్స అవసరం డిఎంహెచ్ఓ

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా తిరుపతి రుయా హాస్పిటల్ పీడియాట్రిక్స్ డిపార్ట్మెంట్ డిఈఐసి నందు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ తలసీమియా అంటే హీమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం వల్ల వచ్చే వారసత్వ రుగ్మత అని అన్నారు. ఎర్ర రక్త కణాలలో ఆక్సిజన్ ను తీసుకెళ్ళడానికి సహాయ పడే ఒక ప్రోటీన్ తక్కువగా ఉండడం అని తెలిపారు. రక్తహీనత,అలసట, శరీరం రంగు పాలి పోవడం, ఎదుగుదల, ఆలస్యం, వంటి లక్షణాలు ఉంటాయని అందరికి చికిత్స అవసరం అవుతుందని అన్నారు. కుటుంబం లో ఎవరికైనా తలసేమియా ఉన్నట్లయితే కుటుంబ సభ్యులందరూ తలసేమియ పరీక్షలకు స్క్రీనింగ్ చేసుకోవాలని తెలిపారు. తలసేవియా వ్యాధి గ్రస్తుల చికిత్స కొరకు రక్తం ఉచితంగా ఎక్కించ బడునని అన్నారు. పీడియాట్రిక్స్ డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ డా. మనోహర్ మాట్లాడుతూ తీవ్రమైన సందర్భాలలో రక్తమార్పిడి, మందులు, ఎముక మజ్జ మార్పిడి వంటి చికిత్సలు అవసరం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎముక మజ్జ ఆపరేషన్ కు 63 మంది రిజిస్టర్ అయి ఉన్నారని 11 మందికి ఆపరేషన్ పూర్తి అయిందని ఇద్దరు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎన్సిడిసిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ ప్రదీప్ ల్యాబ్ టెక్నీషియన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు సాంప్రదాయ వంటకాలు అందించాలి

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ వంటకాలను అందించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా హొటళ్లలో పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి కోరారు. తిరుమలలోని ఆస్థానమండపంలో గురువారం హొటళ్ల నిర్వాహకులు, స్థానికులతో అదనపు ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహార పదార్థాలను భక్తిశ్రద్ధలతో అందించాలన్నారు. తిరుమల యాత్ర భక్తులకు ఒక మధురానుభూతిని కల్పించాలన్నారు. హొటల్ నిర్వాహకులు చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల భక్తులు చాలా అసంతృప్తితో వెళుతున్నారని చెప్పారు. హొటళ్ల యజమానులు చట్టబద్ధమైన నియమ నిబంధనలను పాటించాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. టీటీడీ ఆరోగ్య విభాగం ప్రతిరోజు చేయవలసిన పనులతో కూడిన చెక్లిస్ట్ అందిస్తుందని, దానిని తప్పకుండా పాటించాలన్నారు. టిటిడిలోని అన్ని విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో 33 అన్నప్రసాద కౌంటర్లలో టీటీడీ నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. అదేవిధంగా భగవంతుని సన్నిధిలోని హొటళ్ల యజమానులు కూడా మంచి తినుబండారాలు అందించాలన్నారు. భక్తుల ఆరోగ్యానికి హానికరమైన చైనీస్ వంటకాలను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. హొటళ్లో నిర్వాహకులు, పనిచేసే సిబ్బంది సాంప్రదాయ వస్త్రధారణ ధరించి భక్తులకు సేవలందించాలని, ముఖ్యంగా తెలుగు సాంప్రదాయం ఉట్టిపడాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హొటళ్లో వద్ద ట్రేడ్ లైసెన్స్, జీఎస్టి వంటి ధ్రువీకరణ పత్రాలను అధికారులకు కనిపించేలా డిస్ప్లే చేయాలన్నారు. భక్తులు డిజిటల్ పేమెంట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. హొటల్ నిర్వహణ లైసెన్సును నిర్ణీత సమయంలో రెన్యువల్ చేసుకోవాలన్నారు.

అన్ని దుకాణాలలో ధరల పట్టికను ప్రదర్శించాలని చెప్పారు. ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు సిలిండర్ ఏర్పాటు చేసే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత అధికారులు నడిగి తెలుసుకోవాలన్నారు. హొటళ్ల లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, హొటళ్లో యజమానులు సమిష్టిగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. భక్తులకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు నీరు, విద్యుత్తు వృధా కాకుండా వినియోగించుకోవాలని చెప్పారు. త్వరలో ఐదు నుండి 10 హొటళ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధి విధానాలు అమలు అయ్యేలా నిర్వాహకులు సహకరించాలన్నారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలను టీటీడీ అధికారులు అందిస్తారని వివరించారు. అనంతరం హొటళ్ల నిర్వాహకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అదనపు ఈవోకి వివరించారు. తిరుమలలో స్థానికంగా ఉన్నటువంటి స్థానికులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని అలిపిరి చెక్ పాయింట్ వద్ద స్థానికులకు ప్రత్యేక లైను ఏర్పాటు చేయాలని అదనపు ఈవో కి సూచించారు దీనిపై ఆయన అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర కుమార్, ఆరోగ్య విభాగం డిప్యూటీ ఈ వో సోమన్నారాయణ, ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి శాస్త్రి, విజీఓలు సదాలక్ష్మి, సురేంద్ర ఇతర అధికారులు, హొటళ్ల యజమానులు పాల్గొన్నారు.

నయా ఫాసిజాన్ని ఐక్యంగా ఎదుర్కొందాం

విశాలాంధ్ర-తిరుపతి: 'ఎనభై ఏళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన ఫాసిజాన్ని ప్రాణాలకు సైతం తెగించి ఎర్రసైన్యం ఎదుర్కొందని, ప్రస్తుతం విజృంభిస్తున్న నయా ఫాసిజాన్ని విశాల ఐక్యవేదికగా ప్రజలందరినీ కలుపుకుని ఎదుర్కొందాం' అని సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్రకమిటీ సమావేశాలు తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా 8-10 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి'తో బహిరంగసభ తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో గురువారం సాయంత్రం జరిగింది. తొలుత ఆర్టీసి సెంట్రల్ బస్టాండ్ సమీపంలోని ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి వందలాది మంది కార్యకర్తలతో దాదాపు కిలోమీటర్ పొడవున భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అగ్రభాగాన మార్క్సిస్టు మహనీయుల చిత్రపటాలతో ప్రదర్శనగా నిలిచారు. అనంతరం కచ్చపి ఆడిటోరియంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి'కి చిహ్నంగా తొలుత నేతలు అభివాదం చేశారు. గతంలో హిట్లర్, ముస్సోలిని వంటి కొంతమంది ఫాసిజంతో ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేస్తే రష్యాలో స్టాలిన్ సారథ్యంలో వారిని ఎదుర్కొని ఫాసిజాన్ని కూకటివేళ్లతో నిర్మూలించారని గుర్తు చేశారు. ఫాసిజంపై ఎర్రజెండా మాత్రమే పోరాడిందన్నారు. 2 కోట్ల 60 లక్షల మంది ఎర్రసైన్యం ప్రాణాలను అర్పించి దుష్టపాలనను అంతమొందించిందన్నారు. పెహల్గామ్ ఘటన సందర్భంగా ఒక వర్గాన్ని వ్యతిరేకిస్తూ దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టడం సరైనది కాదన్నారు. ఏప్రిల్ 22న పెహల్గామ్ ఘటనలో 22 మంది ప్రాణాలు కోల్పవడం బాధాకరమని, దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఉగ్రవాదంపై కేంద్రం సాగిస్తున్న దాడికి గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ప్రదాని అధ్యక్షతన జరిగిందని, దీనికి సిపిఎం నుంచి జాన్ బాటర్స్ హాజరయ్యారని, ప్రజలకు నష్టం జరగకుండా ఉగ్రవాదాన్ని నాశనం చేయాలని, అందుకు తమ మద్దతు ఉంటుందని వెల్లడించామని తెలిపారు. ఉగ్రవాదానికి మతం ఉండదని, అన్ని మతాల్లోనూ ఉగ్రవాదం ఉంటుందన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన ఆర్తీ అనే అమ్మాయి, ఆ బాధల్లో కూడా తనను కాపాడి, తనకు ధైర్యం చెప్పిన ఇద్దరు ముస్లీం సోదరులనుద్దేశించి కాశ్మీర్ తనకు ఇద్దరు మిత్రులను ఇచ్చిందని ప్రకటించడం భారతీయ లౌకికవాదానికి నిదర్శనమన్నారు. సిపిఎం 24వ మహాసభ దేశ సమైక్యత కోసం , ప్రజల హక్కుల కోసం పోరాడాలని తీర్మానించిందని, దేశ ప్రజలందర్ని కుల, మతాలకు అతీతంగా ఒకతాటిపై నిలబెట్టాల్సిన బాధ్యత ఎర్రజెండాపై ఉందన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ ఫాసిజం తొలుత కమ్యూనిస్టులను నాశనం చేయాలనుకుంటుందని, హిట్లరు పార్లమెంట్‌ను తగలబెట్టి ఆ నెపాన్ని కమ్యూనిస్టులపై రుద్ది వారిని జైలు పాలు చేశారని, అయినా బెదరకుండా పాసిజంకు వ్యతిరేకంగా ఎర్రసైన్యం ప్రాణాలొడ్డి ఎదుర్కొందన్నారు. వారి త్యాగఫలితమే ప్రపంచ శాంతి అని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ఇదే పునారవృతం అవుతోందని, దేశంలో ప్రజాసంక్షేమం కరువైందన్నారు. లేబర్‌కోడ్ వంటి ప్రజా వ్యతిరేక చట్టాలను తెచ్చి ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారని విమర్శించారు. దీన్ని ప్రతిఘటిస్తున్నది కూడా కమ్యూనిస్టులే అన్నారు. బిజెపి దేశంలో హిందువులు కానివారిని తరిమికొట్టాలని అంటుందని, ఉదారవాదం కూడా ఫాసిజంకు పనికిరాదన్నారు. దళితులు, మహిళలు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఎత్తేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని దుయబట్టారు. పెట్టబడిదారులు పాసిజాన్ని ప్రోత్సహిస్తున్నారని, తొలుత కమ్యూనిస్టులు, మైనార్టీలు, దళితులు, వికలాంగులను సర్వనాశనం చేయడమే %ఎ%్యసిజం లక్ష్యమన్నారు. రాష్ట్రంలోనూ పాసిజానికి పూర్తి మద్దతు ఇచ్చేలా అధికార కూటమి వ్యవహరిస్తుందన్నారు. అనాటి పాసిజం నిర్మూలన స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ నయా పాసిజాన్ని అరికట్టేందుకు ఐక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదానికి, పాసిజానికి వ్యతిరేకంగా అన్ని కులాలు, మతాలు, ప్రాంతాలను ఐక్యం చేసి పోరాడాలని పిలుపునిచ్చారు. గత ఐదు సంవత్సరాలుగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, తన పంటను రైతే రోడ్డుపై పారబోసి తగలబెట్టుకోవాల్సిని పరిస్థితిని నేటి బూర్జువ పాలకులు తీసుకొచ్చారని విమర్శించారు. పి4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన చేస్తామని చెబుతున్నారని, కానీ ఇది వాస్తవదూరంగా ఉందన్నారు. అందుకు నిదర్శనం ఇటీవల మెగా కంపెనీ గుంటూరులో ఆరు కుటుంబాలను దత్తతకు తీసుకుందని, పోలవరం నిర్మాణం చేస్తున్న అదే కంపెనీ అక్కడ కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వడం లేదని, ఇలాంటి వారు పేదలను ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న అభివృద్ధి మంత్రంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండు చేశారు. కౌలు రైతులకు నష్ట పరిహారం లేదని, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎనుగుల దాడి నుంచి రక్షణ లేదని, ప్రజారక్షకుడని చెప్పుకుంటున్న పవన్‌కల్యాన్‌కు ఇవి పట్టవా అని ప్రశ్నించారు. అప్పటికి, ఇప్పటికి ఈ రాష్ట్రంలో సిపిఎం ఒకటే రాజకీయ ప్రత్యామ్నాయం అని అన్నారు. కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ బిజెపి అబద్దాలతోనే అధికారంలోకి వచ్చిందని, ప్రజలను ఊహల్లో పెట్టి పరిపాలిస్తుందని ధ్వజమెత్తారు. ఉగ్రదాడిలో బాధితులు తమను కాపాడిని ముస్లీంలను కొనియాడితే వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా దుషించడం సరైనది కాదన్నారు. కులంతర వివాహం చేసుకుందని తిరుపతి జిల్లాలో ఓ తల్లి తన కూతుర్ని చంపి, పాతిపెట్టిందని, జిల్లా వాసైన సిఎం చంద్రబాబు కనీసం దాన్ని ఖండించకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటి సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, జనార్ధన్, టి.సుబ్రమణ్యం, నాయకులు సాయిలక్ష్మీ, జయచంద్ర, ఆర్.లక్ష్మీ, వేణుగోపాల్, మాధవ్, హరినాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

తడ నూతన ఎంపీడీవోగా శేఖర్ నాయక్

విశాలాంధ్ర-తడ: తడ మండల పరిషత్ కార్యాలయంలో నూతన మండల అభివృద్ధి అధికారిగా శేఖర్ నాయక్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో తడ ఇంచార్జీ ఎంపీడీవో గా పనిచేస్తున్న ఈఓపిఆర్డి విజయ్ కుమార్ మరలా ఈవోపీఆర్డిగా విధులు నిర్వహించనున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి లో ఎంపీడీవో గా పనిచేస్తున్న శేఖర్ నాయక్ తడ ఎంపీడీవో గా బదిలీ పై వచ్చి నూతన ఎంపీడీవోగా పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అందుకు అధికారులు, మండల ప్రజలు సహకరించాలని తెలిపారు.

మద్యం కుంభకోణంపై ప్రత్యేక విచారణ జరపాలి

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన మద్యం కుంభకోణం పై ప్రత్యేక విచారణ జరపాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే పెద్ద కుంభకోణం అని ఆరోపించారు. ఇందులో ఉన్నది స్థాయి అధికారులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు ఇతర ముఖ్యుల ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెలుగు చూస్తున్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడానికి కోసం సిబిఐ ఈడీలతో విచారణ జరిపించి వాస్తవాలను బయటపెట్టి, ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూమిపూజకు హాజరైన ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీసిటీలోని ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు ఐటీశాఖమంత్రి నారా లోకేష్ గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కూడా హాజరయ్యారు.

వైస్-ఛాన్సలర్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావు, పరీక్షల విభాగం, అభివృద్ధి విభాగం, ఆర్థిక విభాగం, ఇడిపి సెల్‌తో సహా పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పని పద్ధతులను వ్యక్తిగతంగా సమీక్షించారు. ఆయన ఉద్యోగులతో మాట్లాడుతూ కార్యాలయంలో క్రమశిక్షణ, జవాబుదారీతనం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. విశ్వవిద్యాలయం ప్రతిష్టను నిలబెట్టడానికి ఉద్యోగులు నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన కోరారు. సమిష్టి కృషి, అంకితభావం ద్వారా విశ్వవిద్యాలయం ప్రగతి సాధించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఖాదర్ భాషాకు మస్తాన్ యాదవ్ పరామర్శ

విశాలాంధ్ర-వెంకటగిరి: తిరుపతి జిల్లా డక్కిలి మండలం చెన్న సముద్రం గ్రామంలో వైసీపీ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ బాషా మాతృమూర్తి ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేత బొలిగల మస్తాన్ యాదవ్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సిసి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి

విశాలాంధ్ర-తిరుపతి: 44వ డివిజన్ మధురానగర్ లో 36.65 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం ప్రారంభించారు. ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజాకార్యక్రమం తరువాత శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆరణి ఆవిష్కరించి రోడ్డును ప్రారంభించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నగరంలోని రోడ్ల ప్యాచ్ వర్కులను పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత పాలకుల తీరుతో మున్సిపల్ కార్పొరేషన్ ను అప్పుల కుప్పగా మారిందని ఆయన ఆరోపించారు. తిరుపతిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు ఐటి శాఖ మంత్రి లోకేష్ లు కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. కాగా సర్వీరోడ్డు ఆక్రమణలతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ ఈ శ్యామ్ సుందర్, ఎంఈ

గోమతి, డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, కార్పొరేటర్లు దూది కుమారి, సికే రేవతి, ఆదం సుధాకర్ రెడ్డి, దూది శివ, యాదవకృష్ణ, రాజా రెడ్డి, సుధాకర్, సాయిదేవ్ యాదవ్, బాజ్జీ, రాజేష్ ఆచ్చారి, ఆళ్వార్ మురళీ, ఆముదాల వెంకటేష్, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, కొండా రాజ్ మోహన్, రమేష్, సుధీర్, మునస్వామి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి రిజిస్టర్ చేసుకోండి

వ్యవసాయ అధికారి వై. సుధాకర్

విశాలాంధ్ర-సోమల: సోమల మండలంలోని రైతు సోదరులు అందరూ అన్నదాత సుఖీభవ పథకానికి ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సోమల మండల వ్యవసాయ అధికారి వై. సుధాకర్ తెలిపారు. ఈ అన్నదాత సుఖీభవ – పి.యం కిసాన్ పథకం క్రింద ప్రతి రైతుకు రూ. 20,000 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం అందరికీ విదితమే. ఇందులో పి యం కిసాన్ రూ. 6000– కేంద్రప్రభుత్వం మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది అని తెలిపారు. మండలం లోని ప్రతి రైతు పట్టాదారు పాస్ పుస్తకము, ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకుని వారి పరిధిలోని రైతుసేవాకేంద్రానికి వెళ్లి మీ డిటైల్స్ రైతుసేవ కేంద్రం అధికారి దగ్గర ధృవీకరం చుకొని రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఈ నెల చివరిలోపు అన్నదాత సుఖీభవ పథకం నగదును రైతుల ఖాతాల్లోకి జమ చేస్తుంది కాబట్టి రైతులు ఈ నెల చివరి లోపు ఈ పథకానికి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తమ సమీప రైతుసేవ కేంద్రం అధికారులను సంప్రదించవలసిందని తెలిపారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి, ఆర్కేవిబి పేట, ఎంఎం విలాసం, కత్తెరపల్లి తదితర రైతు భరోసా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారిని హేమలత రైతులకు వివిధ రకాల పంటలు స్కిన్ ఆఫ్ రైతు శిక్షణ కార్యక్రమం పైన అవగాహన కల్పించారు. రైతులు స్మార్ట్ ఫోన్ ఎలా ఉపయోగించుకోవాలి తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్లో వలన కలిగే లాభాలు వాటి నష్టాలను గురించి వివరించారు. ఫోన్ పే, గూగుల్ వంటి యాప్లను, యూట్యూబ్ వంటి వ్యవసాయ యాప్ల వినియోగం ద్వారా వ్యవసాయం చేసే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు హేమాద్రి, గాయత్రి రైతులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-గంగవరం: మండల వైద్యులు జె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమం డ్రైవర్స్ కాలనీ నందు నిర్వహించారు. ఆయన గర్భవతులకు మరియు బాలింతలకు వారికి అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించారు. అలాగే దీర్ఘకాలికమైన జబ్బులను గురించి అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే వేసవికాలంలో వచ్చే జబ్బులను గురించి తెలియజేశారు. ఎవరికైనా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు వచ్చి వైద్యుల యొక్క వైద్య సలహాలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట వైద్య సిబ్బంది మరియు ఆశాలు పాల్గొన్నారు.

రీ సర్వేలో ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తాం

పూదురులో గ్రామసభ నిర్వహించిన మండల రెవెన్యూశాఖ అధికారులు

విశాలాంధ్ర-నాయుడు పేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీసర్వే ప్రాజెక్టు సంబంధించిన గ్రామ సభను నాయుడుపేట మండల రెవె న్యూశాఖ అధికారులు గురువారం పుదురు సచివాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయు డుపేట తహసిల్దార్ మాగర్ల రాజేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూ సర్వే రికార్డులు 100 సంవత్స రాల క్రితం తయారు చేయబడ్డా యని దానివల్ల భూ సరిహద్దులో తేడాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత సాంకేతిక మరియు ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా రికార్డు లను ఆధునికరిస్తూ మెరుగైన నాణ్యతతో రాష్ట్రంలోని ప్రతి భూ యజమానికి న్యాయం చేయడం కోసం రీసర్వే కార్యక్రమం జరుగు తుందని తెలిపారు. భూ యజమా నుల సంతృప్తే ధ్యేయంగా భూముల రీసర్వే విధానాన్ని సమూలంగా మార్చివేసి నూతన విధానంలో భూ సర్వేని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లోని భూ యజమానులకు సర్వే జరుగు తేది, సమయం ముందు గానే వ్యక్తిగత నోటీసు ఎస్.ఎం.ఎస్. ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశంద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. గ్రామసభ ద్వారా రీసర్వే గురించి ప్రజలకు అర్థమయ్యేరీతిలో తెలియ జేస్తామన్నారు. ప్రభుత్వం కల్పిం చిన ఈ మంచి అవకాశాన్ని ప్రజ లందరూ సద్వినియోగం చేసుకో వాలని కోరారు. పూదురు గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్ట లని అదేవిధంగా రైతులకు ఇబ్బంది కలగకుండా నిబద్ధతతో ఖచ్చిత మైనటువంటి కొలతలతో సర్వే నిర్వ హించాలని ఉపసర్పంచ్ పిల్లాసి మణి ఎమ్మార్వోను కోరారు. ఎమ్మార్వో స్పందిస్తూ ప్రభుత్వ భూములు అన్యాకాంతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి రీ సర్వేలో ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తాం అన్నా రు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ఖచ్చితమైన కొలతలతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు అనంతరం రీసర్వేపై అవగాహన కొరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిల్లాసి మణి ఎంపీటీసీ నరస మ్మ, డివిజనల్ సర్వే అధికారి హరోహర, మండల సర్వే అధికారి చరణ్,పంచాయతీ సెక్రటరీ వెంకటరావు వీఆర్వో శ్రీనివాసులు, విలేజ్ సర్వేర్లు భాగ్యమ్మ, మాబ్ జాన్, టిడిపి నాయకులు గురుమూర్తి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన దుర్గాప్రసాద్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం భూమిపూజ చేశారు. తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. నారా లోకేష్‌ను విమానాశ్రమంలో టీడీపీ యువనాయకులు, మాజీ కౌన్సిలర్ నాగమల్లి దురా గ్రప్రసాద్ మర్యాదాపూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇటీవల ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నేతృత్వంలో మెగా జాబ్‌మేళా నిర్వహించి అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. నియోజకవర్గంలో మరన్ని పరిశ్రమలను ఏర్పాటు చేయాలని తద్వారా యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అందుకు మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దుర్గాప్రసాద్‌తో పాటు ఎన్.వినయ్ కుమార్ కూడా మంత్రి నారా లోకేష్ కలిశారు.

క్రాప్ లోన్లు రెన్యువల్ చేయాలంటే తంటాలే

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలో గల వివిధ బ్యాంకు లలో క్రాప్ లోన్లు తీసుకున్న రైతులు రెన్యూవల్ కోసం చాలా ఇబ్బందులు పడుచున్నారు. బ్యాంకు మేనేజర్లు ఖచ్చితంగా 1బి, అడంగళ్ కావాలని అంటున్నారు. ఐతే రెవిన్యూ కార్యాలయం లో ప్రస్తుతం అసైన్మెంట్ భూములు ఫ్రీహోల్డ్ లో ఉండటం వలన ఆన్ లైన్ అడంగల్ రావడంలేదు. అందుకోసరం అధికారులు సంతకాలు పెట్టడం లెదని మండలంలోని యల్ల కుంట్ల గ్రామ పంచాయతీ, చెదుగుట్లపల్లికి చెందిన శ్రీనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధముగా బ్యాంకు వాళ్ళు 1బి వస్తున్ననూ అడంగల్ కు లింకు పెట్టడం ఏమాత్రం బాగలేదని, కావున వెంటనే ఉన్నతా ధికారులు చొరవ చూపి 1బి ద్వారానే క్రాప్ లోన్లు రెన్యువల్ చేయించుటకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరడమైనది.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

విశాలాంధ్ర-పాకాల: పాకాల పట్టణంలో గురు వారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఇందూ జ్ఞాన వేదిక వి. కోట, బంగారుపాళ్యం సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వీధులలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించి భగవద్గీత గొప్పదనాన్ని తెలియజేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధన తో ధర్మముల స్థాపన జరుగుతుందనిఅదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజలకు గురువుగారు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు గురించి వివరించి వాటిని ఆచరించి జీవితంలో జ్ఞానమార్గంను పొందవలసిందిగా సూచించారు. ఈ కార్యక్ర మంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- వి .కోట, బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు సభ్యులు కె అశోక్ బాబు, బాలాజీ, నరసరావు పేట సుధీర్, బండ్ల కృష్ణారెడ్డి, చరణ్, వాణిశ్రీ, ఝాన్సీ, విజయ్, హరి, హేమ తేజశ్వి, గౌతమ్, ఉదయ్, సుస్మిత, రాణెమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు, ఆక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలం లోని 19 గ్రామ పంచాయితీ లలో ప్రభుత్వ భూములను, పసలమంద లను, పశువుల బీడులను కొందరు రాజకీయ నాయకులు, షాడో సర్పంచ్లు ఆక్రమించుకున్నట్లు మాదృష్టికి వచ్చిందని, కావున ఎవరైనా సదరు పశువుల బీడుగాని, పసలమందలుగాని, ప్రభుత్వ భూములు గాని, చెరువులు గాని ఆక్రమించుకొని ఉంటే తక్షణం వదిలేయాలని, లేనిచో చట్టరీత్యాచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హనుమంతు తెలియజేశారు.

అండర్ బ్రిడ్జ్‌లో ఇరుక్కున్న కంటైనర్

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పట్టణం ఎంబి రోడ్ లో వున్న రైల్వే అండర్ బ్రిడ్జిలో గురువారం మధ్యాహ్నం ఓ కంటైనర్ హైట్ ఎక్కువగా ఉన్నందున బ్రిడ్జ్ హైట్ తక్కువగా ఉన్నందున, కంటైనర్ బ్రిడ్జ్‌లో ఇరుక్కుంది. దీంతో ముందుకు కంటైనర్ వెళ్లలేకపోయింది. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. నిత్యం రద్దీగా ఉన్న అండర్ బ్రిడ్జిలో ఇలా జరగడంతో అటు ప్రజలకు ఇటు ప్రయాణికులకు, ద్విచక్ర వాహనదారులకు ఆటో దారులు ఇబ్బంది పడ్డారు. ఇలాంటి సమస్యలు భవిష్యత్ లో తలెత్తకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యువత సోమరితనం వీడాలి: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ భవానీనగర్ సర్కిల్ లోని ఓ ప్రైవేట్ స్కూల్ లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం ప్రారంభించారు. 16 ఎంఎన్ సి కంపెనీలు ఏడు వందల ఉద్యోగాలు కోసం జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించి సెలక్ట్ అయిన యువతకు సాయంత్రం ఆఫర్ లెటర్స్ అందించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళాలను స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. తిరుపతిలో ఇప్పటి వరకు 14 మినీ జాబ్ మేళాలు నిర్వహించి 615మందికి ఉద్యోగాలను స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ కల్పించిందని ఆయన తెలిపారు. తిరుపతిని విశాఖపట్నం, విజయవాడలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లు కట్టుబడి ఉన్నారని ఆయన చెప్పారు. యువత మెగా జాబ్ మేళాలో ఉద్యోగం లభించకపోతే నిరాశ చెందకుండా తిరిగి ప్రయత్నించాలని ఆయన కోరారు. అలాగే స్థోమతను బట్టి వ్యాపారం ప్రారంభించి కొనసాగిస్తే ఉద్యోగులకన్నా అధికమొత్తం పొందవచ్చని ఆయన సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత జ్ఞానాన్ని పెంచుకుని కష్టపడితే విజయం ఖాయంగా లభిస్తుందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోగా కొత్త కంపెనీలను పెట్టించకపోగా ఉన్నవాటిని ఇతర రాష్ట్రాలకు వెళ్ళగొట్టారని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ జిల్లా అధికారి లోకనాథం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, గీతం స్కూల్స్ యజమాని తమ్మినేని వెంకటేశ్వర రావు, జనసేన నాయకులు రాజా రెడ్డి, దేవర మనోహర్, ఆర్కాట్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర-చిత్తూరు: పదవ తరగతి పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం రాష్ట్రస్థాయిలో మూడో స్థాయిలో నిలిచిన విద్యార్థిని పల్లవిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. చిత్తూరు నగరంలోని ఏ వి ఆర్ పాఠశాల కు చెందిన పల్లవి పదవ తరగతిలో 600 మార్కులు గాను 596 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం రాష్ట్రస్థాయిలో మూడో మూడో స్థానం లో నిలిచింది. గురువారం సాయంత్రం జిల్లా సచివాలయంలో జిల్లా కలెక్టర్ విద్యార్థి పల్లవిని ప్రత్యేకంగా అభినందించి ఇదే స్ఫూర్తితో తదుపరి విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ వి ఆర్ పాఠశాల డీజీఎం సుబ్రహ్మణ్యం రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జాహ్నవి, టీచర్లు శ్యామ్, తులసి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవో శిరీషకు ఘన సన్మానం

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలానికి నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శిరీషకు గురువారం ఘన సన్మానం అందజేయబడింది. ఈ కార్యక్రమాన్ని మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మల సాంబశివ నాయుడు, ఎంపీటీసీ హరిప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకొని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా చూడాలని ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపి, చందు రెడ్డి, చల్ల తదితరులు పాల్గొన్నారు.

నేడు దివంగత మాజీ సీఎం నేదురుమల్లి వర్ధంతి

విశాలాంధ్ర-వెంకటగిరి: రాజకీయ దురంధరుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వెంకటగిరి లోని స్థానిక నేదురుమల్లి నివాసంలో ఉదయం 8:30 గంటలకు నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. నేదురుమల్లి అభిమానులు, వైఎస్ ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. కావున నేదురుమల్లి అభిమానులు, వైఎస్ఆర్సిపి శ్రేణులకు పాల్గొనాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర-చిల్లకూరు: ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడులు పెట్టి, అధిక దిగుబడులు తద్వారా అధిక లాభాలు సాధించే పద్ధతులను ఎల్2 లక్ష్మీనారాయణమ్మ నెలబల్లి-రెట్టపల్లి పంచాయతీ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించారు. పురుగుమందులు ఉపయోగించకుండా జీవ ఎరువులు మరియు సేంద్రియ ఎరువుల తయారీ పద్ధతులను వివరించారు. తక్కువ స్థలాన్ని ఎలా మెరుగుగా ఉపయోగించుకొని ఎక్కువ రకాల కూరగాయల పంటల సాగువిధానం విపులంగా విశదీకరించారు. కేవలం ఒక నాటు ఆవుపేడ మరియు గోమూత్రంతో అద్భుతమైన ఫలితాలు సాధించే విధానం తెలిపారు. పురుగుమందులు అధికవాడకంతో వచ్చే పంటలను ప్రజలు వినియోగించడంతో బిపి, షుగర్, కేన్సర్ తదితర వ్యాధులు ప్రబలడం అందరూ గమనించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఉత్పత్తి అయ్యే పంటలను ప్రజలు తమ ఆహారంలో ఉపయోగిస్తే వ్యాధులు దగ్గరకు రావన్నారు. అవగాహన ర్యాలీ ఎల్2 పి.నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుదేశం నాయకుడు ఆబాక రమణారెడ్డి, వివిఎ మనోహర్, ఎస్. పెంచలయ్య, ఐసిఆర్ పి పెంచలయ్య, పారిచెర్ల యమునమ్మ, ఎన్‌పిఎమ్ రాఘవ, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అంతర్జాతీయ రెడ్ క్రాస్ డే సందర్భంగా గురువారం తొట్టంబేడు మండలం బోనుపల్లి గ్రామంలో శ్రీకాళహస్తి ఎంజిఎం హాస్పిటల్స్, తిరుపతి జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. దాదాపు 200 మంది హాజరు కాగా, వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సంబంధిత సలహాలు ఇచ్చారు. ఎంజిఎం హాస్పిటల్స్ డాక్టర్ లు వైద్య పరీక్షలు నిర్వహించి, జిందాల్ పవర్, సింహపురి సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మందులుఅందజేశారు. ఈ సందర్భంగా ఎంజిఎం హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ ఎంజిఎం హాస్పిటల్స్ స్థాపించినప్పటినుండి శ్రీకాళహస్తి, చుట్టు ప్రక్క గ్రామాల్లో ఎన్నో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని ఈ వైద్య శిబిరాలు పల్లె ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగ కరంగా వుంటాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఎంజిఎం హాస్పిటల్స్ నందు ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ వైద్య శిబిరం విజయవంతానికి మాజీ సర్పంచ్ రామానాయుడు, రిపోర్టర్ కామేష్ ఎంతో సహకరించారాని తెలిపారు. ఈ కార్యక్రమం లో తిరుపతి రెడ్ క్రాస్ సంస్థ ట్రెజరర్ జి.వి. సుబ్బారావు, ఎంసి మెంబెర్ డాక్టర్ కె.సుధీర్, రెడ్ క్రాస్ లైఫ్ మెంబెర్ ఎ.అజయ్ కుమార్, కె.కృష్ణకుమార్, ఎంజిఎం హాస్పిటల్స్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

విశాలాంధ్ర-సోమల: సోమల మండలం సోమల తిరుపతి మార్గంలోని సినిమా సర్కిల్ వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు ముందర భాగం నుజ్జు నుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న భాకరాపేట సమీపంలోని గ్రామానికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 ద్వారా సదుం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ప్రమాదంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్మర్ కొంత దూరంలో ఎగిసిపడింది. అందుకు అమర్చిన బండరాళ్లు 30 మీటర్ల దూరంలో పడ్డాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినది.

కౌన్సిలర్ వివాహ వేడుకల్లో నేదురుమల్లి

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి మునిసిపాలిటీ 13 వార్డు కౌన్సిలర్ కసా కృష్ణమూర్తి కుమార్తె యొక్క వివాహ రిసెప్షన్ కార్యక్రమమును బాలయ్యపల్లి మండలంలోని ముద్దంపల్లి గ్రామపంచాయతీలో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేశారు. ఈ రిసెప్షన్ వేడుకలలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన వైయస్సార్సీపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త.. నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వారి వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నారా లోకేష్ కు ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్ర మానవ వనరుల శాఖా మాత్యులు నారా లోకేష్ కు గురువారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనం గా వీడ్కోలు పలికారు. సత్యవేడు, శ్రీసిటీ పర్యటన నిమిత్తం నారా లోకేష్ బుధవారం వచ్చిన సంగతి తెలిసిందే. శ్రీసిటీ పర్యటన అనంతరం హైదరాబాదు వెళ్లడానికి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరిన నారా లోకేష్‌కు ఊరందూరు సమీపంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున వీడ్కోలు పలికాయి. ఈ సందర్భంగా నారా లోకేష్ ను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డితో పాటు వారి కుటుంబసభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ముగిసిన నాయుడుపేట పోలేరమ్మ జాతర

విశాలాంధ్ర-నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట లో ముగిసిన శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవం రాత్రి అమ్మవారు బజారు వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు. బజారు వీధులలో రోడ్డుకు ఇరువైపులా కిక్కిరిసిపోయిన భక్తులు, డీజే తో యువత బజారు విధులలో వాళ్ళ స్టెప్పులతో హోరెత్తించారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరకి తీసిపోని విధంగా నాయుడుపేట పోలేరమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరలో ఎటువంటి ఘర్షణలు లేకుండా అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకున్నారని దేవస్థాన ఈవో, కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రంలో యువత ఉపాధి వైపు అడుగులు

- పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కే.మురళి మోహన్

విశాలాంధ్ర-పూతలపట్టు: ప్రపంచ ప్రమాణాలు చేరుకునే దిశగా మరో విప్లవాత్మక అడుగు వేస్తుంది. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్కు శ్రీ సిటీలో రాష్ట్ర విద్యా ఐటిఎలక్ట్రానిక్ శాఖామంత్రి నారా లోకేష్ గురువారము భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా తిరుపతి జిల్లా శాసనసభ్యులతో పాటుగా పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కె.మురళి మోహన్ పాల్గొన్నారు. శ్రీ సిటీలో ఎల్జి ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ కు నారా లోకేష్ చేతుల మీదుగా భూమి పూజ జరగడం గర్వకారణం అని కొనియాడారు. వేలాది యువతకు ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ను నారా లోకేష్ ప్రాజెక్టు రూపంలో కార్యరూపం దాల్చడం జరుగుతుందని తెలియజేశారు. ఇటువంటి పెట్టుబడులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. శ్రీ సిటీ వంటి పారిశ్రామిక హబ్ భవిష్యత్తు తరాల కోసం వేసిన బలమైన పునాది అని అన్నారు. రూ". 5001 కోట్లతో ఏర్పాటు రాష్ట్రానికి ముఖ్యముగా రాయలసీమకు ఒక మెరుగైన పారిశ్రామిక దశను తీసుకురావాలని ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ యూనిట్ పూర్తయిన తర్వాత ఏటా లక్షల యూనిట్లు ఉత్పత్తి చేయగల సామర్థ్యం వేల ఉద్యోగాల అవకాశాలు అనుబంధ పరిశ్రమలను అభివృద్ధితో పాటుగా ఈ ప్రాంతానికి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కె.మురళి మోహన్ తెలియజేశారు.

తెల్ల రేషన్ కార్డు పొందుటకు అర్హులు వీరే..

విశాలాంధ్ర-చౌడేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త బియ్యం కార్డు బియ్యం కార్డు పొందే వ్యక్తి ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ స్థానికుడు అయ్యి ప్రజాసాధికార సర్వే అనగా హౌస్ హోల్డ్ మాపింగ్ లో తప్పనిసరిగా ఉండవలెను. ఏ సచివాలయం పరిధిలో మ్యాప్ అయ్యి వుంటారో ఆ సచివాలయం పరిధిలో మాత్రమే బియ్యం కార్డు అప్లై చేసుకోవాలి. ఖచ్చితంగా ఆధార్ యొక్క డీటెయిల్స్ ఆ గ్రామానికి చెందినవి మాత్రమే అయ్యి ఉండాలని, ఇప్పటి వరకు ఎవరికీ అయితే బియ్యం కార్డు లేదో అనగా ఆ వ్యక్తి వాళ్ళ అమ్మ గారి బియ్యం కార్డు లో కానీ అత్త గారి కార్డు లో కానీ లేని వారికి మాత్రమే కొత్త బియ్యం కార్డు ఇవ్వబడును. బియ్యం కార్డు లో వ్యక్తులను జోడించడం చిన్నపిల్లల్ని యాడ్ చేయడానికి వారి యొక్క డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, పెళ్లి అయిన వధువుని జోడించుటకు వారి యొక్క మ్యారేజ్ సర్టిఫికెట్ లేదా ఆధార్ కార్డు లో వారి యొక్క భర్త పేరు వున్నచో దానిని పరిగణలోకి తీసుకోవడం జరుగును ఖచ్చితంగా ఆధార్ కార్డు అడ్రస్ ఆ గ్రామానిది అయ్యి ఉండవలెను. బియ్యం కార్డు విభజన బియ్యం కార్డు విభజించడానికి ముందు వారు ప్రజాసాధికార సర్వే లో సెపరేట్ గా ఉండవలెను. లేనిచో విభజించుట కుదరదు. బియ్యం కార్డు లో వ్యక్తిని తొలగించుట చనిపోయిన వ్యక్తిని మాత్రమే మనం బియ్యం కార్డు నుంచి తొలగించడం జరుగును.అలా కాకుండా చాలా మంది మా అబ్బాయి అమెరికా లో వున్నాడు తను సంపాదించేది మాకు పెడతాడా కార్డు లో నుంచి తీసేయండి ప్రజాసాధికార సర్వేలో నుంచి తప్పించి మాకు బియ్యం కార్డు ఇవ్వమని అడుగుతున్నారు అలాంటివాళ్ళకి గవర్నమెంట్ వారు మళ్ళీ ఆప్షన్ ఇచ్చినపుడు మాత్రమే చేయటం జరుగును గమనించగలరు. ఆధార్ సీడింగ్ కరెక్షన్ తప్పుగా వున్నా ఆధార్ నీ అలా వదిలేసి కొత్త ఆధార్ తో ముందుగా ప్రజాసాధికార సర్వే లో యాడ్ అయిన తరువాత మాత్రమే ఆధార్ సీడ్ చేస్తారని,అడ్రస్ చేంజ్ చేసుకోవాలంటే ఆధార్ అడ్రస్ ఖచ్చితంగా గా ఆ సచివాలయం అడ్రస్ ఉండవలెను మరియు కుటుంబ పెద్ద వేలి ముద్రతో మాత్రమే చేస్తారని, సరెండర్ రైస్ కార్డు బియ్యం కార్డు వద్దు అనుకున్న వారు వారి యొక్క బియ్యం కార్డు ని సరెండర్ చేసుకోవచ్చునని తాహాశిల్దార్ హనుమరుతు తెలియజేశారు.

జీ తెలుగులో రాబిన్ హుడ్, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు ప్రారంభం!

విశాలాంధ్ర-తిరుపతి: ప్రేక్షకులను ఆకట్టుకున్న సూపర్ హిట్ సినిమా 'రాబిన్హుడ్'ను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లల్లోని నటనా ప్రతిభను వెలికితీస్తూ అశేష ప్రేక్షకాదరణతో కొనసాగుతున్న డ్రామా జూనియర్స్ 8 ఈ వారం మాతృదినోత్సవం ప్రత్యేక ఎపిసోడ్తో అలరించేందుకు సిద్ధమైందన్నారు. ప్రారంభం నుంచీ జీతెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న జీ తెలుగు సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ ఈవారం ఫినాలేకి చేరుకుందన్నారు. అంతేకాదు కుటుంబ కథతో పవన్ సాయి, అక్షిత, భావన ప్రధానపాత్రల్లో తెరకెక్కుతున్న సరికొత్త సీరియల్ ఘరానా మొగుడు ప్రారంభం కానుందన్నారు. యాక్షన్ఎంటర్టైనర్ రాబిన్హుడ్ ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు, డ్రామా జూనియర్స్ 8 మాతృదినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్ రాత్రి 9 గంటలకు,సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ గ్రాండ్ ఫినాలే ఆదివారం రాత్రి 9గంటలకు, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు మే 12న ప్రారంభం, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందని తెలిపారు. నితిన్, దేవదత్త నాగే, శ్రీలీల, వెంకీ కుడుముల దర్శకత్వంలో,నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈసినిమాలో నితిన్, శ్రీలీల, దేవదత్త నాగే,సిజ్లు, డేవిడ్ వార్నర్ ముఖ్యపాత్రలు పోషించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించినఈ యాక్షన్ ఎంటర్టైనర్ని మీరూ తప్పకుండా చూసేయండి. ప్రతిభావం తులైనటీనటులు, ఆకట్టుకునే కథతో ఘరానా మొగుడు సీరియల్ జీ తెలుగువీక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ సాయి, అక్షిత ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, భావన, తేజల్, శరత్ చంద్ర, సుచిత్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

తంబిరెడ్డికి కిలివేటి సంజీవయ్య పరామర్శ

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తంబిరెడ్డి జనార్ధనరెడ్డిని సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఇటీవల తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి కంటికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ నాయకులతో కలిసి గురువారం శ్రీరాంనగర్లో ఉన్న జనార్ధన్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ఆరోగ్యవంతంగా ప్రజా క్షేత్రంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, నాయుడుపేట, ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, పాదర్తి హరినాథ్ రెడ్డి, నాయకులు లింగారెడ్డి సురేష్ రెడ్డి, మారంరెడ్డి ముత్యాలురెడ్డి, గొట్టికాటి రవీంద్రారెడ్డి, రవిరెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పట్టణం లో వెలిసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం కళ్యాణోత్సవం లో ముఖ్యఅతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్. పాల్గొన్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ .కుటుంబ సమేతంగా స్వామి వారికీ పట్టువస్త్రాలు సమర్పించారు.. వారికి ఆలయ ఈవో, అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేద మంత్రాచరణతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్ గణేష్. మాజీ మున్సిపల్ చైర్మన్ బిసిఆర్ యుగంధర్, మాజీ వైస్ చైర్మన్ ఏ ఆనంద్, టిడిపి నాయకులు. విక్కీ రాయల్, అశోక్ కుమార్. వెంకటేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కల్పించొద్దు: ఎమ్మెల్యే ఆరణి

విశాలాంధ్ర - తిరుపతి : గంగజాతర మూడవ రోజు బండ వేషంతో భక్తులు గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం గంగమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాను రాను పెరగనున్న భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్స్ నిర్వహణపై ఈఓ జయకుమార్ ను అడిగి తెలుసుకున్నారు. కాగా ఆలయ ప్రాంగణంలో తాతయ్యగుంట గంగమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. మజ్జిగ ప్యాకెట్స్ ను భక్తులకు నేరుగా ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, టిడిపి నాయకులు మహేష్ యాదవ్, ఆముదాల తులసీ, చంద్రారెడ్డి, జనసేన నాయకులు రాజా రెడ్డి, జీవకోన సుధాకర్, బాబ్జీ, పొటుకూరు ఆనంద్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, కొండా రాజ్ మోహన్, రమేష్ నాయుడు, వంశీ, మల్లిశెట్టి లక్ష్మీ, శిరీషా తదితరులు పాల్గొన్నారు

అంగరంగ వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - సూళ్లూరు పేట: సూళ్లూరుపేట పట్టణం లోని జిఎన్‌టి రోడ్‌లో కొలువై ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో జరుగుతున్న 332వ ఆరాధనా మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు గురువారం వేడుకలను ఘనంగా జరిపించారు. ఈ సందర్భాంగా గోవిందమ్మ వీరబ్రహ్మేంద్రస్వాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవముగా జరిపించారు. గోవిందమ్మ వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారాలు చేసి వేదపండితులు శాస్త్రోక్తముగా కళ్యాణ వేడుకను జరిపించారు. ముందుగా కంకణాలు కట్టి ,కన్యాదానం చేసి,నూతన వస్త్రాలు సమర్పించి, జిలకర బెల్లం పెట్టి మాంగల్యధారణ చేసి, తలంబ్రాల వేడుకను జరిపించారు. ఈ కళ్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు, ఆలయ కమిటీ అధ్యక్షులు, తిరుపతి జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చిట్టేటి పెరుమాళ్ దంపతులతో పాటు,చిట్టేటి రామదాస్ దంపతులు, చిట్టేటి విజయకుమార్‌తో పాటు కమిటీ గౌరవాధ్యక్షులు మాధవాచారి, వాకిచర్ల రమేష్,నూలేటి రమణయ్య, బట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు,ఉభయదాతలు చేతులు మీదుగా కళ్యాణ మహోత్సవ పూజలు జరిపించారు, కళ్యాణం అనంతరం సూళ్లూరుపేటకు చెందిన శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం వారి సహకారంతో అన్నప్రసాదాలు పంచిపెట్టడం జరిగింది.

పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు గురువారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 30 మందికి పౌష్టికా హారాన్ని నెల్లూరు నెట్ వర్క్ పాజిటివ్ ప్రెసిడెంట్ ధనార్జ, ఆర్.ఎం.వో డాక్టర్ ప్రసన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సి. ఆర్ .రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారాలతో నిర్వహిస్తున్న మన్నారు ఈ కార్యక్రమంలో ప్రగతి సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, పయ్యావుల మురళి నాయుడు, ప్రభాకర్, మల్లికార్జున్, యశ్వంత్, మునిప్రసాద్ పాల్గొన్నారు.

ఏలుమలైరెడ్డి భౌతిక కాయానికి మోహిత్ రెడ్డి నివాళులు

-చెవిరెడ్డి లక్ష్మీ, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు హాజరు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ సర్పంచ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్రా రెడ్డి తండ్రి ఏలుమలై రెడ్డి భౌతిక కాయానికి చంద్రగిరి నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఏలుమలై రెడ్డి బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు.ఆ విషయం తెలుసుకున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు కూడా రామచంద్రారెడ్డి ఇంటికి చేరుకుని నివాళులు అర్పించారు.అనంతరం రామచంద్రా రెడ్డితో పాటు ఎంపీటీసీ సరేష్ రెడ్డి కుటుంబ సభ్యులు అందరినీ పరామర్శించి ధైర్యం చెప్పారు.విషాదంలో మునిగిన రామచంద్రా రెడ్డి కుటుంబానికి చెవిరెడ్డి కుటుంబీకులు అండగా నిలబడ్డారు.ఈ కార్యక్రమంలో మోహిత్ రెడ్డితో పాటు ఎంపీపీ మూలం చంద్ర మోహన్ రెడ్డి,వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సి.గొల్లపల్లి సర్పంచ్ విడుదల రవి,వైసీపీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి,ఉపేంద్ర రెడ్డి, పాల్గొన్నారు.

11 న తిరుపతిలో మాలల ఆత్మీయ సభ

విశాలాంధ్ర -చిత్తూరు : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా,మాలల ఐక్యతను చాటేందుకు ఈనెల 11న తిరుపతిలో మాలల ఆత్మీయ గౌరవ సభను నిర్వహించనున్నట్లు సీనియర్ దళిత జాతీయ నేత దుగ్గాని జయరాం తెలిపారు. చిత్తూరు ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మాలలకు అన్యాయం జరుగుతోందని. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలకులు నడుచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టడానికి వర్గీకరణను అస్త్రంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. మాలల ఐక్యతను ఆత్మగౌరవాన్నీ చాటేలా ఈనెల 11న తిరుపతి జిల్లా తిరుపతి నగరంలోని ఆశా కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం మూడు గంటలకు సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాల రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘ నాయకులు, మేధావులు, ఉద్యోగ సంఘ నాయకులు సభకు తరలివస్తున్నట్లు చెప్పారు. మాల సోదరులు అధిక సంఖ్యలో సభకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ మాల. సంఘాల నాయకులు రాఘవులు, దామోదరం, ధనుంజయరావు, రాజ్ కుమార్, దాము , దయానందం, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన మీసేవ యూనియన్

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: సత్యవేడు పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం తిరుపతి విమానాశ్రయంలో మీసేవ యూనియన్ స్పందించిన మంత్రి మీసేవ వారికి ప్రజలకు సేవ చేయడానికి మంచి అవకాశం లభించింది. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండి ప్రజలకు మంచిగా సేవలందించండని తెలిపారు. ముందు ముందు సచివాలయంలోని ఉన్న అన్ని సేవలు మీసేవకు అందిస్తామని భరోసా అందించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డికి కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లా ప్రెసిడెంట్ సూర్య కుమార్ మరియు మీసేవ మెంబెర్స్ కిరణ్, శ్రావణ్, తేజ, గుణ, గురవయ్య, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణా మూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ ఆలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - చౌడేపల్లి: దిగువపల్లి గ్రామములో ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బోయకొండ గంగమ్మ దేవస్థానము నందు గురువారము జరిగిన హుండీ లెక్కింపు నందు దేవస్థాన ఆదాయం 42 రోజులకు గాను నగదు రూపంలో రూ. 63,89,617.00, బంగారు 39-250 గ్రాములు, వెండి 470 గ్రాములు, ఫారెన్ కరెన్సీ మరియు రణభేరి గంగమ్మ దేవస్థానము ఆదాయం రూ. 40,463.00 వచ్చినవి. సదరు లెక్కింపునకు దేవస్థాన ఉప కమీషనరు కార్యనిర్వహణాధికారి జె. ఏకాంబరం, మదనపల్లి దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ శశికుమార్ వారు, చౌడేపల్లి పోలీస్ సిబ్బంది, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చౌడేపల్లి వారు మరియు దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

విశాలాంధ్ర- పెనుమూరు: మండలంలోని గొడుగుమానపల్లి గ్రామంలో ఉన్నటువంటి దొనకొండ గంగమ్మ ఆలయం వద్ద గురువారం ఉదయం మహా భారత యజ్ఞం కార్యక్రమములో వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించా మని మాజీ ఎంపీపీ షణ్ముఖ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి శ్రీమతి విజయ్ కుమారి. భాగవతారిణి చే హరికథ కాలక్షేపం జరుగుతుందని తెలిపారు. ఈరోజు నుంచి 18వ తేదీ వరకు శ్రీ వెంకటేశ్వర నాటికల మండల వారిచే రాత్రిపూట ఆటలు నిర్వహిస్తామని తెలిపారు. కావున ప్రజలు రాత్రి పగలు ఆటలకు వచ్చి తిలకించవలెనని తెలిపారు.

చిత్తూరులో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర- చిత్తూరు: రెడ్ క్రాస్ చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాంట్ జయంతిని పురస్కరించుకుని చిత్తూరులో రెడ్ క్రాస్ భవనంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఆర్ఎస్ పూర్ణ చైతన్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని నిరాశ్రయులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అట్లాస్ వైస్ చైర్మన్ గోవర్ధన బాబి కార్యదర్శి సహదేవ నాయుడు, బాలకృష్ణారెడ్డి, మోహన్ కుమార్, అరుణకుమారి, పలువురు రెడ్ క్రాస్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర- చౌడేపల్లి: మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని దుర్గ సముద్రం రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఏవో జ్యోతమ్మ,మాస్టర్ ట్రైనర్ నవీన్ తెలిపారు. గురువారం రైతు సేవా కేంద్రంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు- డిజిటల్ ట్రైనింగ్‌పై రైతులకు శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్ ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వలన కలిగే లాభాలు, వాటి నష్టాలను తెలియజేశారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్లను వ్యవసాయ, అగ్రిసెంట్రల్, ప్లాంటిక్స్,ఎన్పీఎస్ఎస్,మార్కెటింగ్ యాప్ ,యుట్యూబ్ వంటి వ్యవసాయ యాప్ల వినియోగం ద్వారా వ్యవసాయం చేయు విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే వ్యవ సాయ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి రైతులకు తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో 30 మంది రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో ఉన్నవారు 10 మంది రైతులకు శిక్షణ ఇచ్చిన ట్లయితే వారికి టాప్ త్రీ లోని ముగ్గురికి శిక్షక రైతులకు బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు, మూడవ బహుమతిగా రూ.8 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమ తులను కలెక్టర్ చేతుల మీదుగా అందించి, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారిగా మండల వ్యవసాయశాఖ అధికారి జ్యోతమ్మ పాల్గొన్నారు, రైతులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - చౌడేపల్లి: మండలంలోని ఏ కొత్తకోట పంచాయతీ, అగ్రహారం గ్రామంలో లోకేష్, వయసు 26 సంవత్సరాలు, తండ్రి లేట్ . కమలాకర్, అనే వ్యక్తి శక్తికి మించిన అప్పులు చేసి వాటిని తీర్చలేక, మనోవేదనతో క్షణకావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మరణించాడు, లోకేష్ తల్లి హేమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌడేపల్లి సబ్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం.

వర్షం పడితే చిత్తడే

గొల్లమడుగు హరిజనవాడ వాసుల కష్టాలు

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలంలోని గొల్లమడుగు పంచాయతీ హరిజనవాడ వీధిలో వర్షం పడితే పరిస్థితి తీవ్రంగా మారుతోంది. నిన్న కురిసిన వర్షానికి వీధి చిన్న మడుగును తలపించినట్లు మారింది. చిన్నపిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్థులు గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కనబడలేదని వాపోతున్నారు. వీధిలో నిలిచిపోయే వర్షపు నీరు దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను గ్రామవాసులు కోరుతున్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే కూటమి ప్రభుత్వం లక్ష్యం

ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పలమనేరు : స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగా నియోజకవర్గానికో ఎం ఎస్ ఎం ఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రిస్యూర్) పార్కును ఏర్పాటు చేయడం జరుగుతుందని పలమనేరు శాసన సభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణ సమీపం లోని నాగ మంగళం వద్ద రు-15.27 కోట్లతో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఎం ఎస్ ఎం ఈ పార్క్ కు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు పెట్టుబడులు వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావించి ప్రతి ఇంట్లో పారిశ్రామిక తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలను ఇచ్చి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నదన్నారు. రాష్ట్రంలోనే పలమనేరు ప్రాంతం పరిశ్రమల స్థాపనకు అన్ని మంచి అనుకూలమైన ప్రాంతమని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న ఈ ప్రాంతానికి అన్ని విధాల రోడ్డు సౌకర్యంతో పాటు పోర్టు సౌకర్యము, మరియు ఎయిర్పోర్ట్ కనెక్టివిటీ ఉన్నందున పరిశ్రమల స్థాపనకు చాలా అనుకూలమని వివరించారు. భవిష్యత్తులో పలమనేర్ ప్రాంతం మంచి ఇండస్ట్రియల్ కారిడార్‌గా కాబోతుందని కాబట్టి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్థానికులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. ముఖ్యంగా పెద్ద నగరాలైన చెన్నై,బెంగళూరులలోని పారిశ్రామికవేత్తలు రూరల్ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూస్తున్నారని అలాంటి వారికి ఈ ప్రాంతం భవిష్యత్తులో చాలా అనుకూలంగా మారనుందన్నారు. ఈ మధ్యనే తిరుపూరుకు చెందిన ప్రముఖ టెక్స్టైల్ కంపెనీ ఈ ప్రాంతంలో తమ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడాన్ని ఆయన గుర్తు చేశారు. కుప్పం, బైరెడ్డిపల్లి, వీ.కోట ప్రాంతాలు హార్టికల్చర్ పంటలకు అనుకూలం కావడం చేత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కాబట్టి ప్రభుత్వం సరళతరంగా ప్రోత్సాహాలనందిస్తూ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఇంటికో పారిశ్రామికవేత్తలుగా ఈ ప్రాంత వాసులు ముందుకు రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమాల్లో పలమనేరు ఆర్డీవో భవాని,తహసీల్దార్ ఇన్ఫనాథన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, డిఐసి జనరల్ మేనేజర్ సూరి బాబు, డిప్యూటీ జోనల్ మేనేజర్ భార్గవి,అసిస్టెంట్ మేనేజర్ ఇస్మాయిల్, ప్రాజెక్టు ఇంజినీర్ ప్రవీణ్, లైజనింగ్ ఆఫీసర్ లోకేష్, ఐపీవో రామాంజులు మరియు పలమనేరు కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ, తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడ్, రంగనాథ్, నాగరాజు రెడ్డి, ఆర్.బి.సి కుట్టి లతో పాటు నాయకులు గిరి, ప్రతాప్ రెడ్డి మరియు పలమనేర్ ఆటోనగర్ అండ్ ఎం ఎస్ ఎం ఈ యూనియన్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,జగదీష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టిన ప్రత్యేక కమిటీ

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రత్యేక కమిటీ విచారణ చేపట్టింది. ఇటీవల ఆసుపత్రిలో సరైన వైద్యం అందక శ్రీ దుర్గా అనే మహిళ మృతిచెందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు నుంచి అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దీనిపై తిరుపతి రుయాస్పత్రికి చెందిన వైద్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గురువారం చిత్తూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా మృతి పై విచారించడంతోపాటు, చిత్తూరు ఆసుపత్రిలో జిల్లా వైద్య శాఖ అపోలో శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. తదుపరి మరణించిన దుర్గ కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. దీనిపై సమగ్రంగా నివేదిక తయారుచేసి జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని విచారణ కమిటీ బృందం తెలిపింది.

ఎమ్మెల్సీ పరామర్శ

విశాలాంధ్ర-గూడూరు : గూడూరు పట్టణం లోని అరుంధతి వాడ 6 వ వార్డుకు చెందిన పోలిపాటి విజయ్ కుమార్ (శ్రీ లైటింగ్స్) గత నెలలో స్వర్గస్తులయ్యారు. ఈ విషయమై వారి కుటుంబ సభ్యు లను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కలిసి పరామర్శించారు. అండగా ఉంటాం అధైర్య పడవద్దు అని కుటుంబ సభ్యులకు తెలిపారు.

ఎమ్మెల్యే పిఏగా ప్రసన్న కుమార్

విశాలాంధ్ర -గూడూరు : గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ సహాయకులు పి. దేవ ప్రసన్న కుమార్ ను, గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ కు వ్యక్తిగత సహాయకులుగా నియమిం చడం జరిగింది.గతంలో కూడా ఈయన ఎమ్మెల్యే పి. ఏ.గా పనిచేశారు. అనంతరం నెల్లూరు జడ్పీ సి. ఈ.వో విద్యా రమ నుండి ఉత్తర్వులు అందుకున్నారు.

రెమెడియల్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- తడ : మండలంలోని పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు పాఠశాలల్లో నిర్వహించే రెమిడియల్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని తడ మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ రావు తెలియజేశారు. గురువారం తడ మండలంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెమెడియల్ క్లాసులను ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .ఈనెల 19వ తారీఖు నుండి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని, పదో తరగతి తప్పిన విద్యార్థులకు చక్కని అవకాశము మరొక ప్రయత్నం ద్వారా పదవ తరగతి మరలా రాసి ఉత్తీర్ణులయి ఈ సంవత్సరమే ఇంటర్మీడియట్ చేరేందుకు అవకాశం కలుగుతుందని ,ఈ అవకాశం కోల్పోకుండా సంవత్సరం వృథా కాకుండా పదో తరగతి తప్పిన విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని, ఇందుకు సంబంధించి ఎస్‌సిఇఆర్‌టి వారు ఒక టైం టేబుల్ ఇవ్వడం జరిగింది దాని ప్రకారంగా మండలంలో అన్ని హైస్కూల్లల్లో, ఈ రెమిడీలు క్లాసులు జరుగుతున్నాయని తెలిపారు.

రైతులకు డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమం

విశాలాంధ్ర - గుడిపాల : గుడిపాల మండలంలోని సంగమంగళం, బొమ్మ సముద్రం రైతుసేవ కేంద్రాల్లో గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'స్కిల్ అప్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్' కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 30 మంది రైతులకు స్మార్ట్ ఫోన్లు అందించడంతో పాటు ఆధునిక డిజిటల్ వ్యవసాయ శిక్షణను అందించారు. ఈ శిక్షణ ద్వారా రైతులకు వ్యవ సాయ యాప్స్, డిజిటల్ పేమెంట్స్, వాతావరణ సమాచారం, మార్కె ట్ ధరలు, యూట్యూబ్ ఛానల్స్ నిర్వహణ వంటి కీలక అంశాల్లో అవగాహన కల్పించారు. ఒక్కో రైతు తమ పరిధిలోని మరో పది మంది రైతులకు ఈ సమాచారాన్ని పంచడం ద్వారా గ్రామ స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరించేలా లక్ష్యమయ్యారు. ఈ కార్యక్ర మంలో మానిటరింగ్ ఆఫీసర్ గుడిపాల వ్యవసాయ అధికారి మాధ వి, మానిటరింగ్ ఆఫీసర్ సుధాకర్ యాదవ్, మాస్టర్ ట్రైనర్ నదీమ్, ,సెరికల్చర్ అసిస్టెంట్ ప్రమీల మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీసిటీలోని వివిధ ఎలక్ట్రానిక్ పరిశ్రమల స్థాపన కోసం విచ్చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు గురువారం ఘన స్వాగతం లభించింది. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్ పరిశ్రమకు భూమి పూజ చేసిన అనంతరం రేణిగుంట విమానాశ్రయంకు తిరుగు ప్రయాణమైన మంత్రి లోకేష్ కు ఊరందూరు వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వాగతం పలికారు. అశేషంగా వచ్చిన అభిమానులు, టిడిపి కార్యకర్తల సమక్షంలో గజమాలవేసి సత్కరించారు. అనంతరం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెంచయ్య నాయుడు, విజయ్ కుమార్ నాయుడు, మునిరాజు నాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి, మైనారిటీ నాయకులు షాకిరాలి, నాగమల్లి దుర్గాప్రసాద్, గిరిజన నేత సుబ్బయ్య, దళిత నేత, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఈయనకు దక్షిణ గోపురం వద్ద సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస నాయక్, ఏఈవో సతీష్ మాలిక్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: స్మార్ట్ సిటీ నిధులతో నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు గడువు లోపు నాణ్యతతో పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న స్విమ్మింగ్ పూల్,, సిటీ ఆపరేషన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిజైన్ స్టూడియో, గ్లో గార్డెన్, గరుడ వారధి తదితర ప్రాజెక్టుల పనుల పురోగతిపై ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో గురువారం ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ తో కలసి మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ వినాయక సాగర్ లో ఏర్పాటు చేస్తున్న గ్లో గార్డెన్, స్విమ్మింగ్ పూల్ పనుల్లో ఆలస్యం అవుతోందని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్ లో అన్ని విభాగాలకు ఇబ్బంది లేకుండా ప్లాన్ ప్రకారం గదులు కేటాయించాలని అన్నారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు కూడా ఆలస్యం అవుతోందని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈఈ రవి, డి.ఈ.లు రాజు, మహేష్, మధు, ఏఓ రాజశేఖర్, సిఎఫ్ఓ మల్లిఖార్జున, ప్రాజెక్టుల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-చిత్తూరు: పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ చేయడంలో భాగంగా మరణించిన వారి పేర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో జిల్లా లోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిఆర్ఓ కె.మోహన్ కుమార్ తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేసేందుకు బిఎల్ఓ లు క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్ళేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎన్‌సిడి 3.0 సర్వే చేయడం జరుగుతున్నదని, తద్వారా ప్రతి కుటుంబంలోని వివరాలను సేకరించడం జరుగుతున్నదని, మరణించిన వారి వివరాలు కూడా వైద్య ఆరోగ్య శాఖ వద్ద ఉంటాయని, వారితో ఎలెక్షన్ సెల్ అధికారులు సమన్వయం చేసుకుని ప్రతి నియోజకవర్గంలో సచివాలయం వారీగా మరణించిన వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఫారం 6 కింద 3,595 అందగా 2297, ఫారం 7 కింద 3,034 దరఖాస్తులు అందగా అందులో 1,889, ఫారం 8 కింద 5,304 దరఖాస్తులు అందగా 4,177 దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందన్నారు. మరణించిన, మల్టిపుల్ ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని టిడిపి పార్టీ ప్రతినిధి సురేంద్ర కుమార్, పోలింగ్ స్టేషన్ లను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్లు నమోదైన వారికి కార్డుల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని బిజెపి పార్టీ ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజకవర్గానికి ఓటర్ల జాబితాలో పేర్లను మార్పుకు సంబంధించి అంశాలను పరిశీలించాలని సిపిఎం పార్టీ ప్రతినిధి గంగరాజు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులైన వైఎస్ఆర్ సిపి ఎన్. ఉదయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ పరదేశి, జనసేన ప్రతినిధి యశ్వంత్, బి ఎస్ పి ప్రతినిధి భాస్కర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో దుకాణాలు రోడ్లపై పెట్టకుండా చర్యలు చేపట్టండి: కమిషనర్

విశాలాంధ్ర-తిరుపతి: తాతయ్యః గుంట గంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై దుకాణాలు పెట్టకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. జాతర నేపథ్యంలో ఆలయంలో భక్తులకు కల్పించిన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలసి కమిషనర్ గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆలయానికి భక్తులు వచ్చి, వెళ్ళే మార్గాల్లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో రోడ్లపై దుకాణాలు పెట్టడంతో ఇబ్బందులు వస్తున్నాయని, అలా రోడ్లపైకి రాకుండా లైన్లు వేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను, ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో భక్తులు ఎక్కువగా వస్తారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఇందులో 24 గంటలు అన్ని శాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. త్రాగునీరు అందుబాటులో ఉంచామని, మరుగు దొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టాలని అన్నారు. భక్తులు ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనానికి వచ్చి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. వృద్ధులు, పిల్లలు, వికలాంగులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, తులసి కుమార్, ఆలయ ఈవో జయకుమార్, డీసీపీ మహాపాత్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరించిన మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర-సత్యవేడు: పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్వీకరించారు. గురువారం సత్యవేడు పట్టణం వారపు సంత స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశపు మందిరంలో మంత్రి నారా లోకేష్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ నేపథ్యంలో తమ అనుభవంలో ఉన్న గ్రామనతం 20 సెంట్లు భూమికి అడ్డంగా వైఎస్ఆర్సిపి కి చెందిన కొందరు ఆక్రమించుకొని నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని పిచ్చాటూరు మండలం అడవి కోడెంబెడు గ్రామానికి చెందిన దమయంతి విన్నవించింది.తమకు చెందాల్సిన 17 సెంట్లు భూమిని సునీత పేరుతో ఆన్లైన్లో నమోదయిందనే, దీన్ని సరిచేసి 177/1 సీలో కలపాలని సత్యవేడు పట్టణం దలవాయి అగ్రహారం ఎమ్ ఎమ్ ఉదయ్ కుమార్ వినతి సమర్పించారు. ఫోర్జరీ సంతకాలతో పత్రాలు సృష్టించడంతో తలెత్తన భూ వివాదాన్ని పరిష్కరించాలని వరదయ్యపాలెం మండలం నాగనంద పురం గ్రామానికి చెందిన రమేష్ విన్నవించారు.తమ పాఠశాల ఎంపియుపి స్థాయిని తగ్గించొద్దని సత్యవేడు మండలం సిరణంబుదురు గ్రామస్తులు దొరై కన్ను, సీమాన్ అభ్యర్థించారు. సత్యవేడు పట్టణం మసీదు వీధి కాలనీలో దాదాపు 20 ఇండ్ల స్థలాలు ఫారెస్ట్ పరిధిలోకి వస్తున్నట్టు సంబంధిత అధికారులు చెప్పడంపై పూర్తిస్థాయిలో సర్వే చేసి తమకు న్యాయం చేయాలని టిడిపి నాయకుడు పలని విన్నవించారు.చెరువు పొలాల వద్ద రెండు రోజుల క్రితం పడిన గాలి వాన తాకిడికి కిందపడిన విద్యుత్ స్తంభాలను నాటకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్టు సత్యవేడు మండలం మదనంబేడు గ్రామానికి చెందిన రైతు తిరుపతి విన్నవించారు. అంగవైకల్యం ఉన్న తమ కుమారుడు వరుణ్కు సామాజిక భద్రత పింఛను మంజూరు చేయాలని మల్లవారిపాలెం తూర్పు పంచాయతీ చెందిన వెంకటేశ్వర్లు మంత్రి నారాలోకేష్కు వినతి అందించారు.కాగా శ్రీసిటీ ఎల్జీ కంపెనీ నిర్మాణానికి భూమి పూజ నేపథ్యంలో సమయం మించి పోవడంతో అప్పటికే వేచి ఉన్న ప్రజల నుంచి అర్జీలు స్వీకరించగానే అర్థాంతరంగా మంత్రి నారా లోకేష్ వెళ్లిపోవడంతో గంటలకు వేచి ఉన్న అర్జీదారులు పలువురు నిరాశకు లోనయ్యారు.

గంగమ్మ తల్లికి సారె సమర్పించిన భూమన కరుణాకర రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: గురువారం మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి సారెను సమర్పించడం జరిగింది, ఇందులో నగర అధ్యక్షులు మల్లం రవిచంద్ర రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్ వంశి, కార్పొరేటర్ కోటేశ్వరమ్మ, మాజీ గంగమ్మ గుడి చైర్మన్ కట్ట గోపియాదవ్, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్ర రెడ్డి, తొడమనాటి వెంకటేష్ రెడ్డి, తులసి యాదవ్, నీలం బాలాజీ రాయల్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, ఆర్ అజయ్ కుమార్, మాజీ గంగమ్మ గుడి బోర్డు సభ్యులు హరినాథ్ రెడ్డి, ఇరగం అనిల్ రెడ్డి, లక్ష్మీ వెంకటేశ్వర రావు, మద్దాలి శేఖర్ రాయల్, పడమటి కుమార్, పసుపులేటి సురేష్ రాయల్, డిపిఆర్ మురళి, గురువారెడ్డి రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.